మునగ కాయ రూ.50

బాగేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. సరిహద్దు ప్రాంతాల్లో పలుచోట్ల పంటలు దెబ్బతినడంతో కూరగాయల దిగుబడి తగ్గింది. దీంతో కూరగాయల ధరలు పెరిగాయి. ప్రత్యేకించి వెల్లుల్లి కిలో రూ.600, మునగ కిలో రూ.500 (ఒక కాయ రూ.50 - 60) ధర, ఉల్లి కిలో దాదాపు రూ.100 పలుకుతుండడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలపై పెను భారం పడిందనే చెప్పాలి. ఇక టమోటా కిలో రూ.50, ఇతర కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి.



విశ్వ వక్కలిగ మఠం ఉత్తరాధికారిగా

కేఏఎస్ అధికారి

● 15న పట్టాభిషేకం

గురువు చంద్రశేఖరనాథస్వామీజీతో డాక్టర్ హెచ్ఎల్ నాగరాజు
7



ప్రసంగిస్తున్న సీఎం

బానిసత్వం పోవాలంటే విద్యావంతులు పెరగాలి

● చామరాజనగరకు వచ్చి రెండోసారి సీఎం అయ్యా
● మూఢనమ్మకాలను విడనాడాలి: సీఎం
7


యత్నాళ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆందోళనకారులు

యత్నాళ్ వ్యాఖ్యలపై నిరసన

● దిష్టిబొమ్మ దహనం చేసిన లింగాయతలు
7

భారీ బందోబస్తు

శీతాకాల సమావేశాలకు కనీవినీ ఎరుగని బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏడాది శాసనసభ సమావేశాలకు రూ.13.08 కోట్ల రూపాయలు ఖర్చులు అంచనా వేసినట్లు జిల్లా అధికారి మహ్మద్‌రోషన్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.1.50 కోట్లు అధికంగా ఖర్చు కానుందన్నారు. శాసనసభ సమావేశాలు సజావుగా సాగేందుకు 10 ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు, మంత్రుల కార్యదర్శులు, పోలీసు అధికారులు, మార్షల్స్, మీడియా ప్రతినిధులందరితో కలిపి 2,756 గదులను రిజర్వు చేశారు. సమావేశాల వేళ ప్రజాప్రతినిధులు భేటీ అయ్యేందుకు ఆన్‌లైన్ పాస్‌లను మంజూరు చేయనున్నారు. శాసనసభ, పరిషత్ కలాపాలు వీక్షించేందుకు వచ్చేవారికి 8 ప్రాంతాల్లో క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 38 స్టాళ్లతో అవకాశం ఇచ్చారు. సువర్ణసౌధ వద్ద సైన్స్ పార్కును నిర్మించనున్నట్లు తెలిపారు. బెళగావి నగర పోలీస్ కమిషనర్ ఇడా మార్టిన్ మార్బ్యాంగ్, బెళగావి జిల్లా ఎస్పీ డాక్టర్ బీమాశంకర్ గుళేద్‌లు తెలిపిన మేరకు 6,023 మంది సిబ్బందిని బందోబస్తుకు కేటాయించారు. ఆరుగురు ఎస్పీలు, 10మంది అడిషనల్ ఎస్పీలు, 38మంది డీఎస్పీలు, 100మంది సీఐలు, 235మంది ఎస్సైలు ఉంటారన్నారు. 30 డ్రోన్ కెమెరాలను ఉపయోగించి సువర్ణసౌధ ప్రాంతంలో నిరంతరం నిఘా కొనసాగిస్తామన్నారు. 85కుపైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

12 సమావేశాలు.. రూ.154 కోట్లు

బెళగావిలో సువర్ణసౌధ ఏర్పాటైన తర్వాత ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు కొనసాగించడం ఆనవాయితీ. కొవిడ్ కాలంలో రెండేళ్లు మినహా మిగిలిన ప్రతి ఏటా డిసెంబరులో సమావేశాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 12 సమావేశాలు కొనసాగాయి. 2006లో తొలిసారి శీతాకాల సమావేశాలు జరిగాయి. అప్పటికి ఇంకా సువర్ణసౌధ నిర్మాణం చేపట్టలేదు. కేఎల్ఈ విద్యాసంస్థ డాక్టర్ జీరగె ఆడిటోరియంలో తాత్కాలికంగా సమావేశాలు జరిపారు. 2009లోనూ ఇక్కడే కొనసాగించారు. 2012 నాటికి సువర్ణసౌధ నిర్మాణం కాగా అప్పటి నుంచి వరుసగా సమావేశాలు కొనసాగుతున్నాయి. సువర్ణసౌధలో అసెంబ్లీ, విధానపరిషత్‌లతోపాటు ముఖ్యమంత్రి సహా మంత్రులు, చీఫ్‌విప్‌లు, చీఫ్ సెక్రటరీ సహా ప్రిన్సిపల్ సెక్రటరీలకు అవసరమైనన్ని చాంబర్‌లు ఏర్పాటు చేశారు. అయితే లెజిస్లేచర్ హౌస్ (ఎల్‌హెచ్) లేదనే కొరత వెంటాడుతోంది. సువర్ణసౌధకు అనుబంధంగానే ఎల్‌హెచ్‌ను నిర్మించాలనే డిమాండ్ ప్రస్తుత సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఇప్పటివరకు సమావేశాల ఖర్చుల వివరాలు ..

సంవత్సరం	రూ. కోట్లలో
2006	5.00
2009	12.33
2012	7.39
2013	14.40
2014	10.09
2015	6.95
2016	7.20
2017	21.59
2018	13.85
2021	15.00
2022	17.50
2023	23.00

బెళగావిలోని సువర్ణసౌధ

చలో బెళగావి..!

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలకు అధికారులు బెళగావికి తరలివెళ్లారు. మూడు వారాలక్రితమే సిబ్బంది సువర్ణసౌధకు చేరుకుని సంబంధితశాఖల పర్యవేక్షణ కొనసాగించారు. సీనియర్ అధికారులు శుక్రవారం తరలివెళ్లారు. వారాంతంలో అక్కడికి చేరుకుని వారికి కేటాయించిన పనులను పర్యవేక్షించేందుకు వెళ్లారు. సోమవారం శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆదివారం చేరుకోనున్నారు. ఇదే సమయానికి మంత్రులు కూడా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. సీఎం, డీసీఎంలు కూడా బయల్దేరనున్నారు.

బెళగావిలో శాసనసభ సమావేశాల వేళ మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) మహామేళావ్ పేరిట చేపట్టదలిచిన నిరసనకు జిల్లా యంత్రాంగం అనుమతులు ఇవ్వలేదు. ప్రధానంగా మహామేళావ్ జరిపితే కన్నడ సంఘాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తాయి. ఈ వివాదం పలుమార్లు తీవ్రమైన గొడవలకు కారణమైంది. ఎమ్మెల్యేలు, మంత్రుల కార్లపైన గతంలో రాళ్లు రువ్విన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ మహామేళావ్‌కు అనుమతులు ఇవ్వరాదని యంత్రాంగం తీర్మానించింది.

- రేపటి నుంచే శీతాకాల సమావేశాలు
- సువర్ణసౌధకు తరలి వెళ్లిన అధికారులు
- ఎంఈఎస్ మహామేళావ్‌కు అనుమతుల నిరాకరణ
- నిరసనల కోసం 55 సంఘాల వినతి
- డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా
- బందోబస్తుకు ఆరు వేల మందికి పైగా సిబ్బంది

నిరసనకు 55 సంఘాలు సిద్ధం

బెళగావిలో జరిగే శాసనసభ శీతాకాల సమావేశాలంటే ఏటా నిరసనల హోరు కొనసాగుతుంది. సోమవారం నుంచి జరిగే శాసనసభ శీతాకాల సమావేశాల వేళ వివిధ ప్రజాసంఘాలు, ఉద్యోగసంఘాలు, ఇతరత్రా బాధితులు సువర్ణసౌధ ముందు నిరసనకు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు 55 ప్రజాసంఘాలు నిరసనలకు సిద్ధమని ప్రకటించగా 50మంది పోలీసుశాఖకు వినతులు ఇచ్చారు. సువర్ణసౌధ ఎదుట నిరసనలు కొనసాగడం ఇదేమీ కొత్త కాదు. ఏటా కొనసాగుతుంది. బెంగళూరులో శాసనసభ సమావేశాలంటే సమీపంలో నిరసనలకు అనుమతులు ఉండవు. కేవలం ఫ్రీడంపార్కులో మాత్రమే కొనసాగించాల్సి ఉంటుంది. కానీ సువర్ణసౌధ ఎదురుగానే ఆందోళనలు చేస్తారు. అందుకు అనుగుణంగానే భారీగా షామియానాలు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయిస్తుంది. అందుకు తగిన ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. రైతులు, కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల అతిథి ఉపాధ్యాయులు, అతిథి అధ్యాపకులు, ఎయిడెడ్ విద్యాసంస్థల ఉద్యోగుల పించనులకోసం గ్రంథాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు, మాజీ సైనికులు, విద్యుత్ కాంట్రాక్టర్లు, కన్నడ పోరాటసంఘాలు నిరసనకు సిద్ధమయ్యాయి. మరోవైపు లింగాయత పంచమసాలి సముదాయం వారు 10న మంగళవారం 5వేల ట్రాకర్లతో వేలాదిమంది న్యాయవాదులతో కలసి సువర్ణసౌధ ముట్టడికి పిలుపునిచ్చారు. శనివారం బెళగావిలో పంచమసాలి ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు కూడలసంగమ, పంచమసాలి పీఠం, బసవమృత్యుంజయస్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్నారు. లింగాయతలకు 2ఏ రిజర్వేషన్ కల్పించాలని, చెరుకుకు సాంకేతికంగా ధర నిర్ణయించాలని, రాష్ట్రంలోని అన్ని టోల్స్‌లో మాజీ సైనికులకు మినహాయింపు ఇవ్వాలని వంటి పలు డిమాండ్లు పెట్టారు.

సభాపతి పరిశీలన

పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి శనివారం సువర్ణసౌధకు చేరుకున్నారు. అక్కడి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పరిషత్ కార్యదర్శి మహాలక్ష్మీ, ఇతర అధికారులు ఉన్నారు.


పరిషత్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సభాపతి హొరట్టి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

● బాలింతల మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదు ● బిడ్డల పోషణ బాధ్యత ప్రభుత్వానిదే: మంత్రి దినేష్ గుండూరావ్

బళ్లారి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పుకోసం వచ్చి మరణించిన బాలింతల కుటుంబాలను ఆదుకుంటామని, తల్లిని కోల్పోయిన పిల్లల రక్షణ ప్రభుత్వం చేపట్టేలా సీఎంతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావ్ అన్నారు. శనివారం ఆయన మృతిచెందిన బాలింతల ఇళ్లకు వెళ్లి వారి పిల్లలను చూశారు. అలాగే వారి బంధువులు, భర్త, తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం బళ్లారి జిల్లా ఆసుపత్రిని నగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, మేయర్ ముల్లంగినందీష్ లతో కలిసి సందర్శించారు. అక్కడవైద్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బాలింతలు మరణం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. మృతికి కారణాలపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా కనిపించలేదన్నారు. ఆసుపత్రిలో కాన్పుకు వచ్చే గర్భిణీలు భయపడాల్సిన అవసరం లేదని కాన్పులు సజావుగానే జరుగుతాయన్నారు. కూడ్లిగి, మొకాలో మృతి చెందిన బాలింతల కుటుంబాలకు వెళ్లి శిశువులను పరిశీలించి, కుటుంబ పెద్దలను పలకరించారు.


బాలింతతో మాట్లాడుతున్న మంత్రి గుండూరావ్

రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలి

● ఆస్పత్రి ఎదుట బీజేపీ నాయకుల నిరాహారదీక్ష


బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి

మృతి చెందిన బాలింతల కుటుబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనీల్ నాయుడు, మాజీ బుడా అధ్యక్షుడు పాలన్న, కార్పొరేటర్లు ఆస్పత్రి ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. బాలింతల మరణం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం అని ఆరోపించారు. మరణించిన బాలింతల కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని ఉదయం నుంచి సాయంత్ర వరకూ దీక్ష కొనసాగించారు. మంత్రి దినేష్ గుండూరావు వచ్చి సత్యాగ్రహం చేస్తున్నబీజేపీ నాయకులతో మాట్లాడారు. ఇలాంటి మరణాలకు ప్రభుత్వం కూడా చింతిస్తుందన్నారు. మరో విచారణ కమిటీని వేసి వాస్తవాలు నిగ్గు తేలుస్తామన్నారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు దీక్ష విరమించారు.



బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో రాధామోహన్‌దాస్, విజయేంద్ర, యడియూరప్ప

పార్టీ నియమాలకు కట్టుబడాల్సిందే..!

● బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ ● ఉప ఎన్నికల్లో ఓటమిపై కోర్ కమిటీలో చర్చ

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్టీ నియమాలకు నేతలెవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్‌ల నేతృత్వంలో శనివారం పార్టీ కార్యాలయం మల్లేశ్వరంలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ ఉప ఎన్నికల్లో శిగ్గావి, సండూరులలో ఓటమిపై బీజేపీ కోర్ కమిటీలో తీవ్రమైన చర్చ జరిగింది. అనంతరం విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమిపై నివేదిక కోరారన్నారు. పార్టీ ద్వారా గెలుపొందిన ఎస్‌టీ సోమశేఖర్, శివరాం హెబ్బార్‌లు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న విషయమై చర్చ జరిగిందన్నారు. వారు కాంగ్రెస్‌తో పనిచేస్తున్నారనే విషయమై చర్చించామన్నారు. వారిద్దరినీ పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు ఎమ్మెల్యేగా అనర్హులను చేయాలని కోర్ కమిటీ సభ్యులు సూచించారన్నారు. బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై చర్యల విషయం బహిరంగంగా మాట్లాడలేనన్నారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు యడియూరప్ప, కేంద్రమాజీ మంత్రి సదానందగౌడతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా రాధామోహన్‌దాస్ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే యత్నాళ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆయన వివరణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో 71 లక్షలమంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారని, అందరి అభిప్రాయాలు ఒకేరకంగా లేకున్నా పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిందేనన్నారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి


అలంకరణలో ఏడుపడగల నాగప్ప

బళ్లారి రూరల్, కంప్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కుమారస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుక్కసాగరంలో వెలసిన ఏడుపడగల నాగప్పకు, బళ్లారి కుమారస్వామి ఆలయంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు.


కుమారస్వామి ఆలయంలో భక్తుల పూజలు


వైరల్ అవుతున్న ఖైదీల వీడియో

దమ్ముంటే చూస్కోండి..!

● దర్జాగా సిగరెట్లు, మద్యం తాగుతున్న ఖైదీలు
● మూడు రోజులుగా వైరల్ అవుతున్న వీడియోలు
● కలబురగి జైలులో వరుస వివాదాలు

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలబురగి సెంట్రల్‌జైలులో ఖైదీల విలాసాలు సర్వత్రా విమర్శలకు కారణమవుతున్నాయి. సాధారణ ఖైదీలు సైతం జల్సాలు అనుభవిస్తూ వీడియోలు విడుదల చేయడం కలకలం రేపుతోంది. ఇటీవల ఖైదీలు జైలులో సిగరెట్లు తాగుతూ, మద్యం బాటిళ్లతోపాటు ఉండే వీడియోలు వైరల్ అయ్యాయి. గడిచిన నెల రోజులుగా కలబురగి జైలులో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి ఆహారం బాగా లేదని జైలు సూపరింటెండెంట్ వేధిస్తున్నారని మూకుమ్మడి నిరసన చేపట్టిన విషయం విదితమే. వాస్తవానికి కొందరు ఖైదీలు తమకు అవసరమైన వస్తువులు సమకూర్చే విషయంలో పట్టుబట్టి నిరసన చేసినట్లు జైలుశాఖ ఉన్నతాధికారుల ద్వారా తెలుస్తోంది. ఈలోగానే జైలు సూపరింటెండెంట్ కారుకు బాంబుపెట్టి పేల్చివేస్తామని బెదరించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈలోగానే జైలులో ఖైదీలు కొందరు మద్యం బాటిళ్లు, సిగరెట్‌లతో ఉండే వీడియోలు వైరల్ కావడంతో అధికారులు తీవ్రంగానే పరిగణించారు. సూపరింటెండెంట్ అనితాను బదిలీ చేశారు. ఈలోగానే ఆరుగురు ఖైదీలను వివిధ జైళ్లకు మార్పు చేశారు.

చిన్న పరిశ్రమలకు భారీగా రుణాలు


● కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో క్రెడిట్ అవుట్‌రీచ్

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నమధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) ప్రోత్సహించేలా కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో రెండురోజుల పాటు క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ కె సత్యనారాయణరాజు ప్రసంగిస్తూ యువ, వర్ధమాన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 238 ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ పరిధిలో ఇంతవరకు 6,200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల ఎంఎస్ఎంఈ సదస్సులో కెనరా బ్యాంకు ఈడీలు దేబశిశ్ ముఖర్జీ, అశోక్ చంద్ర, హర్‌దీప్‌సింగ్ అహ్లువాలియా, భవేంద్రకుమార్, చీఫ్ జనరల్ మేనేజర్‌లు, జనరల్ మేనేజర్‌లు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నట్లు నగరంలో శనివారం ప్రకటనలో తెలిపారు.


ప్రసంగిస్తున్న కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు

నకిలీ స్వాతంత్ర్య సమరయోధులపై సీరియస్

● గౌరవధనం వెనక్కి తీసుకోవాలని హైకోర్టు ఆదేశం



బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల ముసుగులో ప్రభుత్వం నుంచి గౌరవధనం పొందుతున్న నకిలీ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ముళబాగిలు తాలూకా మండికల్ గ్రామానికి చెందిన ఎంవీ శ్రీనివాస గౌడ 1981 నుంచి పొందిన గౌరవధనం వెనక్కి తీసుకోవాలని హైకోర్టు శుక్రవారం సూచించింది. శ్రీనివాసగౌడ నకిలీ రికార్డులు సృష్టించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నట్లు అర్జీ పెట్టుకుని గౌరవధనం పొందుతున్నారు. అతడు ఎలాంటి స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనలేదని నాగరాజు అనే వ్యక్తి 2015 ఆగస్టు 1న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు లోకాయుక్త కోలారు జిల్లా అధికారికి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూచించింది. అందుకు అనుగుణంగా విచారణ జరిపిన జిల్లా అధికారి, శ్రీనివాసగౌడ తప్పుడు రికార్డులతో గౌరవధనం పొందుతున్నట్టు తేలింది. ఈమేరకు లోకాయుక్తకు నివేదిక సమర్పించారు. 2018 నవంబరు 14న శ్రీనివాసగౌడకు ఇచ్చిన గౌరవధనాన్ని వసూలు చేసే ప్రక్రియ చేపట్టాలని ముళబాగిలు తహసీల్దారుకు ఆదేశించారు. 2019 మే 20న పిటీషనర్‌కు నోటీసు జారీ చేశారు. 2019 మే 30లోగా రూ.9,08,661 గౌరవధనం వాపసు చేయాలని ముళబాగిలు తహసీల్దారు సూచించారు. దీనిపై శ్రీనివాస గౌడ హైకోర్టును ఆశ్రయించారు. సమగ్ర దర్యాప్తు జరిపిన న్యాయమూర్తులు ఎస్‌జి పండిత్, రామచంద్ర డి హుద్దార‌ల ధర్మాసనం పిటీషన్‌ను శుక్రవారం కొట్టివేసింది. అతడి నుంచి గౌరవధనాన్ని వసూలు చేయాలని ఆదేశించింది. ఇదే సందర్భంలోనే నిజమైన స్వాతంత్ర్య సమరయోధులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకాలంలో పిటిషన్‌లు స్వీకరించి పరిష్కరించాలని ధర్మాసనం సూచించింది.

చరిత్రలో జరగని వేడుక: పరిటాల సునీత



ప్రతిజ్ఞ చేయిస్తున్న పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇలాంటి సమావేశాలు జరగలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. తాను కుంటిమద్ది పాఠశాలలో ఏడో తరగతి పరీక్షలు రాశాననని, నాటి పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేకపోయానని గుర్తు చేసుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. హెచ్ఎం అనంత పద్మనాభులు, ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్ఐ సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు రంగయ్య, రామ్మూర్తినాయుడు, సుధాకర్, మారుతీప్రసాద్, అశోక్‌కుమార్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా అభివృద్ధి : కాలవ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ



కణేకల్లు/రాయదుర్గం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను దేశం గర్వించేలా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. కణేకల్లు క్రాసింగ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, రాయదుర్గం జడ్పీ బాలికోన్నత పాఠశాలలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను ఏ స్థాయిలో ఉన్నాయో తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునేందుకు ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు ఉన్నతస్థాయిలో ఎదిగేందుకు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గురుకుల పాఠశాలలను ప్రారంభించారని అన్నారు. వీటిలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయ్యారని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఒక ట్రిపుల్ ఐటీ కళాశాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాయుడు, ఛైర్మెన్ రుద్రప్ప, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, నాగమణి, టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, సీఆర్‌పీలు రాజేష్, లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, హనుమంతరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో

మెగా పీటీఎం

అక్షరాల సంక్రాంతి

తల్లిదండ్రులు, నాయకులు, అధికారుల రాకతో సందడి

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

గురువులలో ఆనందం

విరాళాలను సమర్పించిన దాతలు..

ఉమ్మడి జిల్లాలోని 3799 పాఠశాలల్లో వేడుకలు



బడి వరకూ మాత్రమే వచ్చే అమ్మ, నాన్న ఈసారి బడిలోకి వచ్చారు. 'ఎలా చదువుతున్నారు' అని గురువులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, నాయకులు, గురువులు చెప్పింది విన్నారు. ఆటపాటల్లో పాల్గొన్నారు. బహుమతులను అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3799 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జరిగిన సంబరం ఇది. మునుపెన్నడూ లేని విధంగా.. సంక్రాంతి సంబరాలను తలపించేలా.. సరస్వతీమాత పులకించేలా జరిగిన వేడుక.



అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో..

భవిష్యత్తుకు బాటలు వేయండి: శ్రావణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

బుక్కరాయసముద్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాటలు వేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. సిద్దరాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యాను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

అప్పుడప్పుడు బడికి రండి: జేసీ



మాట్లాడుతున్న జేసీ శివ నారాయణ శర్మ

అనంతపురం విద్య/రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలలకు రావాలని, తమ పిల్లల ప్రగతి గురించి తెలుసుకోవాలని జేసీ శివనారాయణ శర్మ సూచించారు. అనంతపురం నగరంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పైకి వచ్చానని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల సహా అన్నీ ఉచితంగా అందిస్తోందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మారాలి: దగ్గుపాటి



విద్యార్థులు బాగుపడాలనే ఉపాధ్యాయులు దండిస్తారని, వారిపై తల్లిదండ్రులు దండెత్తడం సరికాదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తపోవనం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని మారాలని సూచించారు. దేశంలోనే మొట్టమొదటి సారి మెగా పీటీఎం నిర్వహిస్తున్నామని, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. పూర్వ విద్యార్థులను ఏకం చేసి పాఠశాలల అభివృద్ధికి నిధులు సేకరించాలని హెచ్ఎంలకు సూచించారు. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ అధ్వాన్నంగా మారిందని, పాఠశాల స్థాయిలోనే గంజాయికి అలవాటు పడే దారుణమైన పరిస్థితులు చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. తన వంతుగా రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌కు రూ.50 వేలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి తపోవనం పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు అందజేశారు. వేడుకలలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఎంఈఓ వెంకటస్వామి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఫక్కీరప్ప, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు డిష్‌నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివితే బంగారు భవిష్యత్తు: ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, డిసెంబరు 7: విద్యార్థులు బాగా చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుళ్ళసముద్రం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన పీటీఎంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధి పట్ల శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల విశ్రాంతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి ఎంఈఓలు భాస్కర్, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ,డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ సర్పంచు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను ప్రోత్సహించండి: కందికుంట



కదిరి బాలికల ఉన్నతపాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి/నంబులపూలకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాంకేతిక పట్ల ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. కదిరిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, నంబులపూలకుంట మండలం కమ్మగుట్టపల్లి మండల పరిషత్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తు కృత్రిమ మేధస్సుదేనని, అందుకు అనుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలలో తల్లిదండ్రులసమావేశం ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణ, ఎంఇఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, హెచ్ఎంలు వెంకటాచలం, లియాఖత్, జయప్రతాప్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, కౌన్సిలర్ రంగారెడ్డి, రాజేంద్రనాయుడు, దండే రవిశంకర్, బాషా, హనుమంతురెడ్డి, రెడ్డెప్ప, ఉపాధ్యాయుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చొరవతో సంక్షేమ గురుకులాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

చిలమత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వారధిగా ఉండేలా మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. టేకులోడు బాలిక గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఎన్టీఆర్ చొరవతో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల సంక్షేమ పాఠశాలలు ఆవిర్భవించాయని అన్నారు. తద్వారా ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 107 బీసీ హాస్టళ్లలో 105 టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినవే అని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.25 కోట్లు మంజూరు చేశారని అన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరమని అన్నారు. విద్యార్థులు నేరాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు మత్తుకు బానిసలయ్యారని అన్నారు. విద్యార్థినులు దేనికీ భయపడకూడదని, సమస్యలను ఎదుర్కొని నిలబడాలని సూచించారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించి, ఎమ్మెల్యే బాలకృష్ణకు గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సోమశేఖర్, శ్రీదేవి తదితరలు పాల్గొన్నారు.



టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన మంత్రి సవిత

విలువలతోనే రాణింపు: అశ్మిత్

తాడిపత్రి/యాడికి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించగలరని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి అన్నారు. యాడికి కేజీబీవీ, తాడిపత్రి శ్రీనివాసపురం ట్రిపుల్ ఎస్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. చదివిన పాఠశాలను, స్వగ్రామాలను మరచిపోకుండా వాటి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషిచేయాలని అన్నారు. వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచు విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఎంఈఓ కాశప్ప, కేజీబీవీ ఎస్ఓ నిర్మల, తహసీల్దారు రజాక్‌వలి, ఎంఈఓ నాగరాజు, నాయకులు రామచంద్రారెడ్డి, అఖిల్, అరవింద నారాయణరెడ్డి, సంజీవపురం పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాడికి కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంస్కారంతో ఎదగాలి: గుమ్మనూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని, సంస్కారవంతులుగా ఎదగాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఎస్జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేడుకలలో ఆయన పాల్గొన్నారు. కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లల నడవడిని గమనించాలని సూచించారు. విద్యార్థులు తమ గురువులను గౌరవించాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం గోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, గుజిరీ మహమ్మద్ ఖాజా, ఫజులు, పెంచలపాడు వెంకటేశులు, న్యాయవాది వెంకటేశులు, వాసగిరి మణికంఠ, వనగొంది విజయలక్ష్మి, కొలిమి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అందరిలో అంటే ఎలా అమ్మా?



అనంతపురం రాజేంద్ర నగరపాలిక పాఠశాలలో అందరూ సంతోషంగా ఉంటున్న సమయంలో ఈ బంగారు తల్లి ఎందుకు ఏడుస్తోందో తెలుసా..? 'బాగా చదవకుంటే ఎలా..?' అని అందరి ఎదుటా అమ్మ మందలించినందుకు..! స్నేహితుల నడుమ.. ఇలా అడగకూడదు కదమ్మా..! పదిమందిలో పొగడాలి.. ఏకాంతంలో హితవు పలకాలి..!

బడికి సక్రమంగా పంపండి: సింధూర



పెడపల్లి జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/ఓబుళదేవరచెరువు/నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలను పాఠశాలలకు సక్రమంగా పంపించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తల్లితండ్రులకు సూచించారు. పెడపల్లి జడ్పీఉన్నత పాఠశాల, ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల ప్రభుత్వ ఉన్నతపాఠశాల, నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రామాపురం గురుకుల వసతి పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. బడికి సక్రమంగా పంపితే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. పిల్లల నడవడికపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు నిఘా వేయాలని, వారు వ్యసనాలబారిన పడకుండా చూడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బడ్జెట్లో విద్యకు రూ.29,904 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కార్యక్రమాలలో ఎంఈఓలు సురేష్, రమణ, హెచ్ఎంలు జంషీద్‌బాషా, సుధారాణి, భాస్కర్, రమణి, స్కూల్ కమిటీ ఛైర్మన్‌లు రవి, బాబునాయక్, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, శ్రీరాంనాయక్, నాగరాజు, జయచంద్ర, జాకీర్ అహమ్మద్, రాజారెడ్డి, జెరిపిటి అంజనప్ప, ఇర్షాద్, షాన్వాజ్, బడిశం రామాంజి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట: జేసీ

నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల గురించి ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ దాదాపీర్ పాల్గొన్నారు.

విలువలను పెంచండి: వెంకటశివుడు యాదవ్



గుత్తిలో మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్

గుత్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో మానవీయ విలువలను పెంచాలని, వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమయం కేటాయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ కోరారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాలలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. వేడుకలలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంఈఓ రవినాయక్, సీఐ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, నారాయణ, ఎంకే చౌదరి, బద్రివలి పాల్గొన్నారు.



అమ్మ చేతి ముద్ద.. కమ్మగా..



చదివిన బడికి రాయల్ మురళి సాయం.. రూ.50 వేలు



బుజ్జోడి బుర్రలో ఏవేవో ప్రశ్నలు.. అక్కను అడుగుదామంటే.. లాంగ్వేజ్ ప్రాబ్లమ్..!



ఎప్పటికీ గుర్తుండిపోయేలా.. ఎమ్మెల్యే పరిటాల సునీత గోరు ముద్ద.. చిత్రాన్ని దాచుకో చిన్నారీ..!

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌలమ్...

ఉదయ్‌శంకర్ (జయంతి)



నాట్య రూపకర్త ఉదయ్ శంకర్ చౌదరి 1900 డిసెంబరు 8న రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్‌లో జన్మించారు. యూరోపియన్ పద్ధతులను భారతీయ శాస్త్రీయ నృత్యానికి, గిరిజన నృత్యానికి అనుగుణంగా మార్చడంలో ప్రసిద్ధి చెందారు. 1920, 30 దశకాలలో ఐరోపా, అమెరికాలలో ప్రాచుర్యం కల్పించారు. దేశ ఆధునిక నృత్యానికి మార్గదర్శకుడిగా నిలిచారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ నుంచి జీవితసాఫల్య పురస్కారం, పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1977 సెప్టెంబరు 26న కన్నుమూశారు. ఆయన శత జయంతికి గౌరవంగా 2001లో యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్యారిస్‌లో డ్యాన్సర్‌లో, కొరియోగ్రాఫర్‌లు ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి మాస్టర్‌కు నివాళులు అర్పించారు.

నేదునూరి కృష్ణమూర్తి (వర్ధంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. సంగీతంపై ఆసక్తితో ద్వారం నరసింరావు నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాకపాణిల వద్ద తర్ఫీదు పొందారు. ఆలిండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా రాణించారు. 1951 నుంచి ఐదు దశాబ్దాలకుపైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత కళానిధి పురస్కారం పొందారు. 2014 డిసెంబరు 8న కన్నుమూశారు.

షర్మిలా ఠాగూర్ (పుట్టినరోజు)



హిందీ సినీ రంగంలో పేరొందిన షర్మిలా ఠాగూర్ 1944 డిసెంబరు 8న జన్మించారు. బేగం ఆయేషా సుల్తానాగా గుర్తింపు పొందారు. రెండు జాతీయ పురస్కారాలు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ఇండియన్ ఫిల్మ్ సెన్సార్‌బోర్డు అధ్యక్షురాలిగా 2004 నుంచి 2011వరకు వ్యవహరించారు. 2005లో యూనిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. 2013లో పద్మభూషణ్ పురస్కారం పొందారు.

కార్మికశాఖ ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోండి

చింతామణి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు, ఇతర రంగాల కార్మికులకోసం కార్మికశాఖ ఇస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, చిక్కబళ్ళాపుర ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ పిలుపునిచ్చారు. చింతామణి తాలూకా పంచాయతీ సామర్థ్య సౌధలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో వెల్డర్, ప్లంబర్ వృత్తిదారులకు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ వృత్తిదారులకు కిట్‌లను ఇస్తోందని, అర్హులైన కార్మికులు నమోదు చేసుకుని గుర్తింపుకార్డు ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. కార్మికశాఖ అధికారి కళావాణి మాట్లాడుతూ ప్రస్తుతం 25మంది వెల్డర్‌లు, 120మంది ప్లంబర్‌లకు కిట్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ వేదికపై నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ, ఉపాధ్యక్షుడు రాణియమ్మ, నగర యోజనా ప్రాధికార అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, తహసీల్దారు సుదర్శన్ యాదవ్, తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్, నగర సభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు కిట్‌లు అందజేస్తున్న మంత్రి సుధాకర్

బీటెక్ తర్వాత ఆరేడేళ్లలో వృత్తిజీవనంలో స్థిరత్వం

» పీఈఎస్ స్నాతకోత్సవంలో ఫెస్టో ఇండియా ఎండీ



పట్టాల ప్రదానోత్సవంలో పీఈఎస్ ప్రొ-చాన్స్‌లర్ జవహర్, ఫెస్టో ఇండియా ఎండీ రష్మికాంత్ జోషి తదితరులు

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆరేడేళ్లలో వృత్తిజీవనంలో స్థిరత్వం సాధ్యం కానుందని ఆ దిశగా ప్రతి విద్యార్థి వ్యవహరించాలని ఫెస్టో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రష్మికాంత్ జోషి అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవం శనివారం జరిగింది. ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి అధ్యక్షత వహించారు. 4,402 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను, 16మంది పీహెచ్‌డీ. ముగ్గురు ఎంటెక్ పరిశోధన అవార్డులను పొందారు. 91మంది బంగారుపతకాలను సాధించగా వీరిలో 55మంది విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి రష్మికాంత్ జోషి మాట్లాడుతూ సాంకేతిక విద్య దేశవ్యాప్తంగా సరళీకృతమైందని, పీఈఎస్ వంటి విద్యాసంస్థలు గుణాత్మకతకు ప్రాధాన్యత ఇస్తున్నందున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ తర్వాత ఉన్నత విద్య లేదా పరిశోధనలు, స్టార్టప్‌ల వంటి అంశాలలో స్థిరపడేందుకు ఆరేడేళ్లు అవసరం అవుతుందన్నారు. ఇంజనీరింగ్‌లో నిరంతరం ఆధునాతనం వస్తోందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి ప్రత్యేక సందేశాన్ని సీఓఓ అజయ్‌కుమార్ చదివి వినిపించారు. పీఈఎస్ విద్యాసంస్థలు ఐదు దశాబ్దాలుగా గుణాత్మకతకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జాతినిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని ఈ దశలోనే అకడమిక్‌తోపాటు సాంకేతికంగా అంతర్జాతీయస్థాయిని ఆలోచించేలా తీరుస్తున్నామన్నారు. విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు తగిన సౌలభ్యాలు సమకూరుస్తున్నా మన్నారు. దేశం యొక్క ప్రతిష్టాత్మకమైన విలువలు ప్రతిబింబించే జాతీయశక్తిగా విద్యార్థులను తీరుస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యార్థులనుంచి విశ్వ మానవుడిగా పరివర్తన దిశగా పీఈఎస్ సంస్థలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్‌సిటీలో ఆరంభించిన మెడికల్ కళాశాల ద్వారా ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ జే సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోప్‌ఫారం సర్కిల్‌లో

అండర్‌పాస్ పనులకు శ్రీకారం

మహదేవపుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్ మెయిన్ రోడ్డుపై హోప్‌ఫారం సర్కిల్‌లో అండర్‌పాస్ పనులకు ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు మాజీ మంత్రి లింబావళి ఎంతోకృషి చేశారని ఇందులో భాగంగా హోప్‌ఫారం వద్ద అండర్‌పాస్ చేపడుతున్నామన్నారు. ఇటీవలికాలంలో రద్దీ పెరగడంతో నియంత్రణకోసం హోప్‌ఫారం వద్ద అండర్‌పాస్ అవసరమని గుర్తించామన్నారు. ఈమేరకు త్వరలోనే పనులు చేపట్టి స్థానికులకు అనుకూలం చేయాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో వందలాది ఐటీబీటీ సంస్థలు, ఇంటర్నేషనల్ స్కూల్స్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండడంతో ట్రాఫిక్ రద్దీ అధికమైందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకోసం మాజీ మంత్రి లింబావళి ఎన్నో కార్యాచరణలు అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహదేవపుర నగర బీజేపీ అధ్యక్షుడు మనోహరరెడ్డి, గ్రామీణ బీజేపీ, మొబిలిటీ టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు నటరాజ్, బీజేపీ హోబళి ప్రధాన కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ ఉపాధ్యక్షుడు ఎల్ రాజేశ్, బీబీఎంపీ అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజులా లింబావళి

కొడతి పంచాయతీ

ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా మంజునాథ్



మంజునాథ్‌ను అభినందిస్తున్న పంచాయతీ సభ్యులు తదితరులు

దొమ్మసంద్ర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొడతి గ్రామపంచాయతీ ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా ఎం మంజునాథ్ ఎంపికయ్యారు. సరిహద్దులోని మహదేవపుర నియోజకవర్గ పరిధిలోని కొడతి గ్రామపంచాయతీకి అధ్యక్షుడు మంజునాథ్‌ను గ్రామపంచాయతీ సభ్యులు, స్థానిక ప్రముఖులు శనివారం ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ పంచాయతీ సభ్యులందరి సహకారంతో పరిధిలోని ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నానన్నారు. ఇందుకు ప్రామాణికంగా కృషి చేస్తానన్నారు. గ్రామ పంచాయతీని చెత్త రహిత, స్వచ్ఛత పంచాయతీగా తీర్చడమే లక్ష్యమన్నారు. పంచాయతీ సభ్యుడు సతీశ్ మాట్లాడుతూ మంజునాథ్ గతంలో ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన వేళ పేద విద్యార్థులకు ఎంతో సాయం చేశారని, సామాజిక సేవలతో ఆదరణ పొందారన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు సమాజసేవకుడు సదాశివరెడ్డి, కొడతి గ్రామపంచాయతీ సభ్యులు నారాయణస్వామి (బాబు), సతీశ్, నంజుండరెడ్డి, శివకుమార్, రామస్వామి, ఎస్‌కే రమేశ్, వీణా రవి, శుభబాబు, ఆంటోని మేరీ, ఆశా చిట్టిబాబు, మమతా లక్ష్మణ్, కార్యదర్శి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాల సమాఖ్యలో అక్రమాలు

బంగారపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోలారు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం మేనేజర్ గోపాలస్వామి ప్రభుత్వ నియమాలను గాలికి వదిలేసి ప్రభావ వ్యక్తులకోసం నియోజకవర్గాన్ని విభజించి పేద రైతులకు వంచన చేశారని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి ఆరోపించారు. పట్టణంలోని పురసభ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి పాలన అందించే ఉద్దేశ్యంతో అవిభాజ్య కోలారు, చిక్కబళ్ళాపుర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని వేరు చేశారన్నారు. కోలారు జిల్లాను 11 నియోజకవర్గాలను విభజించి జాయింట్ డైరెక్టర్ అక్టోబరు 29న ఆదేశించారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, సబ్‌రిజిస్ట్రార్‌లు, ప్రజల సమక్షంలో సభ నిర్వహించి సమర్పించిన అనంతరం సభ నిర్ణయాలను ప్రభుత్వ కార్యాలయ నోటీసుబోర్డులో పొందుపరచాల్సి ఉండేదన్నారు. ప్రజలనుంచి అభ్యంతరాలకు అవకాశం కల్పించాల్సి ఉండగా చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వాన్ని దారి తప్పించేలా అక్రమంగా భూమి మంజూరు చేశారన్నారు. హత్తూరు హోబళి హొళలి గ్రామ సర్వే 130లో 569 ఎకరాల గోమాళ భూమి ఉందని దీన్ని ఆక్రమించే ఉద్దేశ్యంతో కేఎంఎఫ్‌కు చెందిన రైతులకు ఇస్తామంటూ నమ్మించి 50 ఎకరాలను 2020 అక్టోబరులో చిక్కబళ్ళాపుర పాల సమాఖ్య డైరెక్టర్‌కు మంజూరు చేయించారన్నారు. అయితే వాస్తవానికి రైతులకు దక్కలేదని ఆరోపించారు. గోల్డెన్ డెయిరీకి చెందిన కుటుంబం ప్రభావంతో పాడి రైతులకు అన్యాయం జరిగిందన్నారు. ఇకనైనా పాడిరైతులకు న్యాయం చేసేలా అధికారులు స్పందించాల్సి ఉందన్నారు. సమావేశంలో పురసభ అధ్యక్షుడు గోవింద, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాల రెడ్డి, పురసభ సభ్యులు చంద్రారెడ్డి, షంషుద్దీన్‌బాబు, అరుణాచలం మణి, రాకేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

నత్త నడకన వైట్ ట్యాపింగ్ పనులు - ప్రయాణికులకు ఇబ్బందులు



మెజస్టిక్‌లో వైట్‌ట్యాపింగ్ పనులు

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా మెజస్టిక్‌కు చేరుకోవాల్సిందే. ఇక్కడనుంచి నగరంలోని అన్ని ప్రదేశాలకు బీఎంటీసీ బస్సులతోపాటు కేఎస్‌ఆర్టీసీ, రైల్వేస్టేషన్, మెట్రో సేవలు అనుసంధానంగా ఉన్నాయి. ఈ ప్రాంతానికి నిత్యం ఆరేడులక్షలమందికిపైగానే రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి క్లిష్టమైన ప్రదేశంలో వైట్‌ట్యాపింగ్ పనులు నత్త నడకన సాగుతుండడంతో నిత్యం వేలాదిమంది ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ తరుణంలో బెంగళూరు నగరంలో కొనసాగుతున్న వైట్ ట్యాపింగ్ పనులను వేగిరం చేసి రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలని బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశించారు. మెజస్టిక్, చిక్కపేట సహా నగర వ్యాప్తంగా పలు ప్రాంతాలలో సీసీ రోడ్డు, వైట్‌ట్యాపింగ్ పనులు కొన్ని నెలలుగా సాగుతున్నాయి. అయితే ఇటీవల వర్షాలు, ఇతరత్రా కారణాలతో జాప్యమవుతోంది.

పరిశ్రమల ప్రగతికి సమన్వయం ముఖ్యం

» బీసీఐసీ తీర్మానం

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల ప్రగతికి సమాఖ్య ముఖ్యమని తద్వారా సమన్వయంతో అభివృద్ధి చెందుదామని బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) ప్రకటించింది. కౌన్సిల్ ఆఫ్ అసోసియేషన్ (సీఓఏ) సంస్థలో బీసీఐసీతోపాటు బిడది ఇండస్ట్రియల్ అసోసియేషన్, ఎలక్ట్రానిక్‌సిటీ పరిశ్రమల సంఘం, ఎఫ్‌కేసీసీఐ, కర్ణాటక చిన్న తరహా పరిశ్రమల సమాఖ్య (కాసియా), కర్ణాటక ఉద్యోగుల సంఘం, లఘు ఉద్యోగ భారతి, పీణ్యా, వైట్‌ఫీల్డ్ పరిశ్రమల సంఘాలు కలిపి సీఓఏగా ఏర్పాటైనట్టు బీసీఐసీ చైర్మన్ వినీత్‌వర్మ వెల్లడించారు. కౌన్సిల్ ఆఫ్ అసోసియేషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల పరిశ్రమల మధ్య సమన్వయం ఏర్పడుతుందని తద్వారా భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలకు అనుకూలం కాగలదని అభిప్రాయపడ్డారు. వివిధ సంఘాల సభ్యులు, ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.



వివిధ సంఘాల సభ్యులు

సంచారానికి అనుగుణంగా మారుతి వాహనాలు

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైడ్ హైలింగ్ కంపెనీలలో పేరొందిన కారు, డ్రైవర్‌లు, ఫ్లీట్ ఆపరేటర్‌లకు వాహనాన్ని సమకూర్చే లెడ్జ్ రైడ్ సంస్థ, మోటో బిజినెస్ సర్వీస్ ఇండియాతో కలసి బెంగళూరులో సంచారానికి అనుగుణంగా మారుతి వాహనాలను రూపొందించింది. 51 సీఎన్‌జి వాహనాలను అప్పగించింది. లెడ్జ్‌రైడ్ సీఈఓ కోఫౌండర్ తరుణ్ జైన్, మోటో సంస్థ సీఈఓ నకాట హిరోషిల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా తరుణ్‌జైన్ మాట్లాడుతూ నగరంలో కీలకమైన సంస్థ భాగస్వామ్యంతో సేవలు అందించేందుకు రంగంలోకి దిగామన్నారు. ఈ ఏడాది మార్చిలో ప్రయాణాలు ప్రారంభించి 2లక్షలకు పైగా ట్రిప్‌లను పూర్తి చేశామన్నారు. వినియోగదారులకు సేవలందించేందుకు దోహదపడిందన్నారు.

క్షయ రహిత జిల్లా లక్ష్యంగా సమష్టి కృషి సాగించాలి

● డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు

రాయచూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా నిబద్ధతతో కృషి చేయాలని డీహెచ్ఓ డా.వై.సురేంద్ర బాబు సూచించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన క్షయ రోగ నిర్మూలన 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని శనివారం నగరంలోని చంద్రబండా పీహెచ్‌సీ వద్ద డీహెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా.వై.సురేంద్ర బాబు, క్షయ రోగానికి సంబంధించే ఐదు ప్రధాన లక్షణాలను వివరిస్తు అందులో ఏ ఒక్క లక్షణం కనిపించినా వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. క్షయ రోగం ప్రత్యేకమైన క్రిమి ద్వార ఒకరి నుంచి ఇంకొకరికి సోకే ప్రమాదముంటుందని ఈ విషయంలో ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కాగా రాష్ట్రంలో ఎక్కువ క్షయ వ్యాధిగ్రస్థులున్న జిల్లాలో 100 రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ ద్వార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని జిల్లాలో 100 రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు డీహెచ్ఓ తెలిపారు.

ముల్లై డ్యాం మరమ్మతుల్లో అలసత్వమా?

● ఈపీఎస్ ప్రశ్న

అడయార్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముల్లై పెరియార్ డ్యాం మరమ్మతులను చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మదురై, తేని, దిండిగల్, శివగంగై, రామనాథపురం జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి అవసరాలను తీర్చే ఈ ముల్లై పెరియార్ డ్యాంకు యేటా మరమ్మతులు చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే, ఈ యేడాది ఈ పనులు చేపట్టేందుకు వీలుగా, నిర్మాణ సామాగ్రిని డ్యాం వద్దకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ముల్లై పెరియార్ డ్యాం మరమ్మతులు, నిర్వహణ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు.

బానిసత్వం పోవాలంటే

విద్యావంతులు పెరగాలి

» చామరాజనగరకు వచ్చి రెండోసారి సీఎం అయ్యా

» సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కులవ్యవస్థతో ఇంకా బానిసత్వం కొనసాగుతోందని, అటువంటి నీచమైన సంస్కృతి పోవాలంటే శాస్త్రీయత, ఉన్నత విద్యావంతులు సమాజంలో పెరగాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. చామరాజనగర జిల్లాలో శనివారం పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. చామరాజనగరకు వెళ్తే సీఎం పదవి పోతుందనే సెంటిమెంట్ ఉండేదని, ఈ మూఢనమ్మకానికి తాను వ్యతిరేకినన్నారు. చామరాజనగరకు 2013-18 మధ్య ఎన్నోసార్లు వెళ్లానని అయినా రెండోసారి సీఎం అయ్యానన్నారు. ఇలాంటి మూఢ నమ్మకాలను పట్టించుకోరాదన్నారు. యల్లందూరు తాలూకాలో వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన, కొళ్ళేగాల సంస్థలు, జేఎస్ఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వీరసింహాసన మహాసంస్థాన మఠం జగద్గురు శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ 109వ జయంతిని ప్రారంభించారు. సత్తేగాళలో నిర్మించిన లక్ష్మమ్మ సొసయ్యన సిద్దయ్య ప్రభుత్వ పాఠశాల భవనాలను లాంఛనంగా ఆరంభించారు. సీఎం వెంట మంత్రి మహదేవప్పతోపాటు పలువురు పాల్గొన్నారు. కాగా సీఎం సభలో పాల్గొన్న హనూరు జేడీఎస్ ఎమ్మెల్యే మంజునాథ్, సీఎం సిద్దరామయ్యను కొనియాడడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్యే యత్నాళ్‌కు వ్యతిరేకంగా లింగాయతల నిరసన

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బసవణ్ణ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై లింగాయత సంఘాలు శనివారం నిరసన చేపట్టాయి. బెళగావిలో పలు లింగాయత సంఘాలు ఆందోళన చేశాయి. నగరంలోని కన్నడ సాహిత్య భవన్‌లో సమావేశమయ్యారు. చన్నమ్మసర్కిల్ మీదుగా జిల్లా అధికారి కార్యాలయం దాకా ర్యాలీగా సాగారు. ఎమ్మెల్యే యత్నాళ్ అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా యత్నాళ్ కూడా అదే సామాజికవర్గానికి చెందినవారు కావడం గమనార్హం.

ఢిల్లీ నేతల ఆదేశాలు పాటిస్తా: యత్నాళ్

కాగా నాలుగురోజులపాటు ఢిల్లీలో గడిపి హుబ్బళ్ళికి వచ్చిన యత్నాళ్ శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ నేతలు సైలెంట్‌గా ఉండాలని సూచించారని, వారి ఆదేశాలు పాటిస్తానన్నారు. అయితే నేను సైలెంట్‌గా ఉంటానని, రమేశ్ జార్కిహొళి వయొలెంట్ అవుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం కొనసాగుతుందన్నారు. క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడితోపాటు రాజ్‌నాథ్‌సింగ్‌ను భేటీ అయ్యానన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి అధిష్టానానికి లేఖల రూపంలో సమాచారం ఇస్తానన్నారు. అది విజయేంద్రతోపాటు అందరిపైనా ఉంటుందన్నారు. మా టార్గెట్ విజయేంద్ర కాదని, బీజేపీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. 35ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, యత్నాళ్‌ను పార్టీనుంచి బయటకు పంపుతామనేది మూర్ఖత్వమన్నారు. నాపై క్రమశిక్షణా చర్యల ప్రశ్నే లేదన్నారు. మంచిపనులు చేస్తే భవిష్యత్తు ఉంటుందని సూచించిందని అందుకు అనుగుణంగా వ్యవహరిస్తానన్నారు.

విశ్వ వక్కలిగ మఠం ఉత్తరాధికారిగా కేఏఎస్ అధికారి

» 15న పట్టాభిషేకం

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కెంగేరిలోని విశ్వ వక్కలిగ మఠం ఉత్తరాధికారిగా కేఏఎస్ అధికారి డాక్టర్ హెచ్‌ఎల్ నాగరాజును నియమించారు. నాగరాజు మండ్య అదనపు జిల్లా అధికారిగా వ్యవహరిస్తూ సుదీర్ఘకాల సెలవుపై వెళ్లారు. సన్యాసత్వాన్ని స్వీకరించేందుకు నిర్ణయించారు. గడిచిన రెండు వారాలుగా నాగరాజు సెలవుపై వెళ్తారని సన్యాసం స్వీకరిస్తారనే ప్రచారం సాగింది. అయితే ఎప్పుడు, ఏ మఠానికి ఉత్తరాధికారి అవుతారనేది స్పష్టత ఉండేది కాదు. విశ్వ వక్కలిగ మఠాధిపతిగా వ్యవహరిస్తున్న చంద్రశేఖరనాథ స్వామిజీ అనారోగ్యం కారణంగా పీఠత్యాగ ప్రక్రియ జరిగింది. ఈనెల 15న నాగరాజు ఉత్తరాధికారిగా ప్రక్రియ చేపట్టనున్నారు. 'నిశ్చలానందనాథ స్వామిజీ'గా పేరు మారి మఠం బాధ్యతలు స్వీకరించనున్నారు.

తెలంగాణ ఏసీ సర్వీసులలో 10శాతం రాయితీ

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి తెలంగాణ ప్రాంతాలకు వెళ్లే ఏసీ సర్వీసులకు 10శాతం రాయితీ ఉందని బెంగళూరు ఏటీఎం ప్రసాద్‌గౌడ తెలిపారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే ఏసీ సర్వీసులకు నెలాఖరు వరకు 10శాతం రాయితీ ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రధాన నగరాలకు ఏసీ సర్వీసులు ఉన్నాయన్నారు.

రేపటి నుంచి 125 సబర్బన్ రైళ్ల రద్దు

అడయార్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్ మరమ్మతులు, ఇంజనీరింగ్ పనుల కారణంగా ఈనెల 9వ తేదీ నుంచి 125 సబర్బన్ రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే శనివారం పేర్కొంది. చెన్నై బీచ్ - తాంబరం మధ్య ప్రతిరోజూ 200 సబర్బన్ రైలు సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ట్రాక్ మరమ్మతులు, ఇంజనీరింగ్ పనుల కారణంగా వచ్చే సోమవారం నుంచి ఆదివారం రైల్వే టైంటేబుల్ ప్రకారం సర్వీసులు నడుస్తాయని దక్షిణ రైల్వే వెల్లడించింది.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.51	1,592.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,531	577
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,164	2,347
నీటి నిల్వ (టీఎంసీలు)	92.24	12.82

బస్సు ఢీకొని 25 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

సిరుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు గొర్రెల మందపై దూసుకుపోవడంతో 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 20 గొర్రెలు గాయపడ్డాయి. శనివారం శిరిగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై సిరుగుప్ప నుంచి బళ్లారి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైరాపుర గ్రామం వద్ద గొర్రెలను ఢీకొంది. కూడ్లిగి తాలుకాకు చెందిన బొమ్మగట్ట ఈరన్నకు చెందిన గొర్రెలు మృతి చెందాయి. గొర్రెలను రోడ్డు దాటిస్తున్న సమయంలో బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గొర్రెల మృతితో తీవ్ర నష్టం వాటిల్లిందని, పరిహారం చెల్లించి ఆదుకోవాలని గొర్రెల కాపరి కోరారు. శిరిగేరి ఎస్ఐ సద్దామ్ హుస్సేన్ దర్యాప్తు చేపట్టారు.

ఇడపనూరు ఎస్ఐ పై సస్పెన్షన్ వేటు



ఎస్ఐ అవినాశ్ కాంబ్లె

రాయచూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు తాలూకా లోని ఇడపనూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అవినాశ్ కాంబ్లె పై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఎస్ఐని సస్పెండ్ చేస్తు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఈ ఉత్తర్వులు అమలులోకొస్తాయని ఎస్పీ కార్యాలయం ప్రకటించింది.

జిల్లా అసుపత్రిలో లోకాయుక్త తనిఖీలు

● 25 మందికి పైగా పాల్గొన్న బృందం ● మందుల కొనుగోళ్ల జాబితా, కంపెనీల వివరాల సేకరణ

బళ్లారి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (గోషా ఆసుపత్రి)లో శనివారం లోకాయుక్త ఎస్పీ సిద్దరాజ నేతృత్వంలో సుమారు 25 మంది అధికార బృందం వచ్చి ఆసుపత్రిలో సోదాలు చేపట్టింది. బృందం ముందుగా ఆసుపత్రిలో కాన్పుల గది, మందుల నిల్వ ఉంచిన స్టాక్ రూం, అలాగే స్టాఫ్ రికార్డులు, పరిశీలించింది. ప్రభుత్వజిల్లా సర్జికల్ వైద్యుడు బసిరెడ్డితో వివరాలు సేకరించింది. బాలింతల మృతికి కారణమైన ఐవీ ఫ్లూయిడ్స్ 156 బాటిల్స్‌ను సీజ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ లోకాయుక్త సోదాలు కొనసాగించారు. అనంతరం లోకాయుక్త ఎస్పీ సిద్దారాజ మీడియాతో మాట్లాడారు. బాలింతల మృతిపై విచారణకే ఆసుపత్రిలో సోదాలు చేపట్టామన్నారు. పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి, కోర్టుకు నివేదిక అందజేస్తామన్నారు. రాత్రి వరకూ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి.



ఆస్పత్రిలో లోకాయుక్త అధికారులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..

బళ్లారి సిటీ, (ఆంధ్రజ్యోతి): బాలింతల మరణాలు ప్రభుత్వ నిర్లక్ష్యమేనని బీజేపీ రాష్ట్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మంజుళ ఆరోపించారు. శనివారం జిల్లాసుపత్రిలో బాలింతలను వార్డును పరిశీలించిన ఆమె ఇది ప్రభుత్వ ప్రేరేపిత హత్యలే అన్నారు. ఆరోగ్య మంత్రి నిర్లక్ష్యం కారణంగానే ఇది జరిగిందన్నారు. మృతురాలి కుటుంబాలకు కేవలం రెండు లక్షల రూపాయల పరిహారం అందించడం దారుణమన్నారు. బాలింతలు మృతి చెందితే వారి పిల్లల బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆరుగురు మృతి చెందారన్నారు. మృతుల కుటుంబానికి కనీసం రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే రూపాలి నాయక్, ఎమ్మెల్సీ హేమలత నాయక్ వార్డులోని బాలింతలను పరామర్శించారు.



బాలింతలను పరామర్శిస్తున్న బీజేపీ మహిళా నాయకులు

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: సీపీఎం



రోజమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న సీపీఐఎం నాయకులు

కంప్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి విమ్స్ డైరెక్టర్ గంగాధర గౌడను డాక్టర్ బసిరెడ్డిలపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం పార్టీ శివశంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కురుగోడు తాలుకా పరిధిలోని బ్రాహ్మణి క్యాంపులో మృతి చెందిన బాలింత రోజమ్మ నివాసాన్ని సందర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతి చెందిన బాలింతల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. పేదల వైద్యంపై నిర్లక్ష్యం వహించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. గాలి బసవరాజు, సోమప్ప, అనిల్‌సాబ్, మంజునాథ్, జయరామ్, వీరేష్, దొడ్డ బసమ్మ, జడెమ్మ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు ప్రమాదకరం

● నందివీరి పీఠాధిపతి శివకుమార్ మహాస్వామి



మేళాలో గుమ్మడి కాయలను పరిశీలిస్తున్న శివకుమార్ మహాస్వామి

రాయచూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువులను వినియోగిస్తూ పంటను విషమయం చేస్తున్నారని కప్పతగుడ్డ నందివేరి సంస్థానం మఠాధిపతి శివకుమార్ మహాస్వామి అన్నారు. రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కృషి మేళాను శనివారం మహాస్వామి గోపూజతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాస్వామి శాస్త్రీయ మార్పులు స్వాగతార్హమే అయినా పశు సంపద లేకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం పలు స్టాళ్లను సందర్శించారు.

మహిళా సాధికారతే లక్ష్యం

● ధర్మస్థళ గ్రామీణ క్షేమాభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ చంద్రశేఖర్

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా పటిష్టపరచి వారిలో సాధికారత సాధించడమే లక్ష్యమని దర్మస్థళ గ్రామీణ క్షేమాభివృద్ధి సంస్థ కొప్పళ జిల్లా రీజినల్ డైరెక్టర్ జె. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలో బీడీఏఏ మైదానంలో శ్రీ క్షేత్ర ధర్మస్థళ గ్రామీణా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి మహిళా విచార సంకీర్ణ కార్యక్రమాన్ని యూనియన్ అధ్యక్షులు కావ్య ప్రారంభించగా, కార్యక్రమాన్ని ఉద్దేశించి చంద్రశేఖర్ మాట్లాడారు. మాతృశ్రీ డాక్టర్ హేమావతి వి.హెగ్డే మహిళలను సబలీకరణ చేయాలనే మహత్వరమైన ఆశాయాన్ని కలిగి ఉన్నారని, ఆమె కలలు సాకారం చేసే దిశలో మహిళా జ్ఞాన వికాస కార్యక్రమం ప్రారంభించిదని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళల నుండి అనూహ్యమైన స్పందన లభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలతో పోరాడుతున్న మహిళలకు, వారి కుటుంబంలోని సహ్యలకు అవగాహన కల్పించి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలకు చక్కపరచడంలో భాగంగా "గెళతి" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళల సంక్షేమాభివృద్ధి కోసం స్వయం ఉపాధిని కల్పిస్తూ వారిలో వ్యాపార రంగంలో నైపుణ్యం తీసుకురావడానికి జ్ఞాన వికాస కార్యక్రమం ఎంతో ఉపయుక్తమవుతుందన్నారు. అందుకోసం శ్రద్ధా అమిత్ మార్గదర్శకంలో జ్ఞాన వికాస యూట్యూబ్ చానెల్ ద్వారా ప్రతి వారం గ్రామీణ మహిళల జ్ఞానాభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాల సద్వినియోగం, ఆరోగ్యం, పరిశుభ్రత, స్వయం ఉపాధి తదిరత అంశాలను ఈ చానెల్ ద్వారా మహిళలకు అవసరమైన సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆనంతరం ఆర్‌వైఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ సవితా సనోళి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి ఇళ్ళలో పిల్లల మొబైల్ వెంట పడడం సర్వసాధారణమైందని, మహిళలు ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోక పోతే పిల్లల బంగారు భవిష్యత్ నాశనానికి వారే కారణమవుతారన్నారు. కార్యక్రమంలో బ్రూస్‌పేట సీపీఐ సింధూర, అఖిల కర్ణాటక జిల్లా జనజాగృతి వేదిక అధ్యక్షులు ఎల్.విరుపాక్షప్ప, కర్ణాటక గ్రామీణ బ్యాంకే సెంట్రల్ కార్యాలయం చీఫ్ మేనేజర్ మానస, అఖిల కర్ణాటక జిల్లాజన జాగృతి వేదిక సభ్యులు రూపశ్రీ, సుధా గాంవ్కర్, బళ్ళారి సిటీ విభాగం పరిశీలకులు సంజీవ, విభాగం పరిశీలకులు రత్న, మహిళా జ్ఞాన వికాస సమన్వయ అధికారి ఆశా, యూనియన్ అధ్యక్షులు పదాధికారులు, మహిళా జ్ఞాన వికాస కేంద్ర సభ్యులు, స్వయం సేవా సంఘం సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ చంద్రశేఖర్



సుభాస్‌చంద్రబోస్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సైనికులు, రైతులను గౌరవించాలి

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశాన్ని రక్షించే సైనికుడిని, అందరికీ అన్నం పెట్టే రైతులను గౌరవించడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ళగుర్కి పేర్కొన్నారు. శనివారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 75వ సాయుధ జెండా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థులు దేశానికి సేవ చేయాలనే కలలు, లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి, శ్వేత, ఉమ్మెహాని, విద్యార్థులు అనూష, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనందా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అవార్డు



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న స్కూల్ చైర్మన్ గాంధీ

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చండీగడ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఫ్ఏపీ ఇండియా జాతీయ అవార్డు కార్యక్రమంలో శ్రీనంద పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సరిత ఉత్తమ అడ్మినిస్ట్రేటివ్ అవార్డును అందుకున్నారు. ముఖ్యఉపాధ్యాయుడైన లక్ష్మీకాంత్‌కు బెంగళూరు సూర్య ఫౌండేషన్, స్పార్క్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల శిక్షణ ప్రకాశ అవార్డు అందుకున్నారు. తమకూరు జోన్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీనందా స్కూల్ 8వ తరగతి విద్యార్థి అభిషేక్ బౌలింగ్ విభాగంలో ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యారు. ఇంతటి విజయం సాధించిన ఈ ముగ్గురిని స్కూల్ యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. ఈసందర్భంగా స్కూల్ చైర్మన్ గాంధీ, రమణకుమార్, మురళి కృష్ణ , వినయ్‌కుమార్, రాజేశ్వరీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

శ్రీమేధా కళాశాల విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీమేధా కళాశాలలో శనివారం విద్యార్థులు రక్తదానం చేశారు. నగరంలోని ఆరోగ్యకుటుంబసంక్షేమ శాఖ, బ్రూస్‌పేట ఆరోగ్యప్రాథమిక కేంద్రం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్పందన బ్లడ్‌బ్యాంక్, రెడ్‌క్రాస్ సంస్థ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ ప్రారంభించి మాట్లాడారు. రక్తదాన ఆవశ్యకతను ఆయన విద్యార్థులకు వివరించారు. ప్రాథమిక విద్యా కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేఖ ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో సుమారు 90మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆపరేషన్స్ మేనేజర్ , స్పందన బ్లడ్ బ్యాంక్ అంతా జోషి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధికి భయపడకండి: మేయర్



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి లక్షణాలు కనిపిస్తే భయపడవద్దని, ప్రాథమిక దశలోనే చికిత్స పొందితే పూర్తిగా నయం చేసుకోవచ్చని మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీష్ సూచించారు. శనివారం నగరంలోని జిల్లాపంచాయతీ హాల్లో జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయితీ, జిల్లాఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ , జిల్లాక్షయ నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించిన టీబీ డిటెక్షన్ అండ్ ట్రీట్‌మెంట్ 100రోజుల ప్రచార కార్యక్రమాన్ని కాయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్నక్షయవ్యాధికి తగిన చికిత్స ఉందని, సకాలంలో వైద్యం పొంది ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. సివిల్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని దీనిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు వైద్యారోగ్యశాఖతో సహకరించాలన్నారు. మొబైల్ ఎక్స్‌రేతోపాటు ఇతర వ్యూహాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాపరిపాలన , ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖల సహకారంతో 300 జిల్లాల్లో 100రోజుల ప్రచారం నిర్వహించి దేశాన్ని క్షయ రహిత దేశంగా చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారిణి ఇంద్రాణి నిక్షయ్ వాహనంలో మొబైల్ ఎక్స్‌రే ప్రదర్శనను పరిశీలించారు. ట్యూబర్క్యులోసిస్ డిటెక్షన్ అండ్ ట్రీట్‌మెంట్ -100 డేస్ క్యాంపయిన్ పేరుతో సెల్ఫీ బూత్‌ను ప్రారంభించడం ఈకార్యక్రమంలో విశేషం అన్నారు. ఈకార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ క్షయవ్యాధి కన్సల్టెంట్ డాక్టర్ సల్మావరద,జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్‌శరణప్ప, కార్పోరేషన్‌సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయాలి

సిరుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి పార్టీని బలోపేతం చేస్తేనే రానున్న ఎన్నికల్లో బీజేపీకి విజయం లభిస్తుందని బీజేపీ తాలుకా అధ్యక్షులు మల్లికార్జున స్వామి అభిప్రాయపడ్డారు. శనివారం సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ తాలుకా అధ్యక్షులు మల్లికార్జున స్వామి మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో బూత్ స్థాయిలో కార్యకర్తల కృషి కారణంగానే బీజేపీకి అధికారం దక్కిందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టేందుకు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ ఉలిగప్ప, తాలుకా ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజు, బండ్రాల్ మల్లికార్జున, నగర అధ్యక్షులు విక్రమ్ జైన్, సీనియర్ నాయకులు బసవరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహళ్ మల్లికార్జున స్వామి

హోసూరు జోన్

కర్ణాటక తరహా పరిహారానికి డిమాండ్



మీడియాతో రాజ్యసభ సభ్యుడు తంబిదురై, రైతు సంఘాల నాయకులు

హోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అవుటర్ రింగ్ రోడ్డు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంల్లో రాష్ట్రం ప్రభుత్వం స్థానిక రైతులకు అన్యాయం చేసిందని పార్లమెంటరీ హామీల కమిటీ చైర్మెన్, అన్నాడీఎంకే రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తంబిదురై ఆరోపించారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, యుల్పుదుచ్చి 288 కి.మీ మేర శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును ప్రారంభించి తమిళనాడును, కర్ణాటక రాజధాని బెంగళూరుతో అనుసంధానం చేస్తోందన్నారు. ఇందుల్లో తమిళనాడుల్లో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టులో 45 కి.మీలు ఉండగా రైతులనుంచి భూమిని సేకరించారని పరిహారంగా ఎకరాకు రూ.3లక్షలు ఇవ్వగా, పొరుగున కర్ణాటకలో ఎకరాకు కోటి రూపాయలు ఇచ్చారన్నారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి కర్ణాటక తరహాలో తమిళనాడు రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, రైతు సంఘం నిర్వాహకులు మునివెంకటప్ప, రవీంద్ర రెడ్డి, తూర్పు ప్రాంత కార్యదర్శుల రాజా, అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలరోడ్లను బాగు చేయండి

హోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని బాగలూరు రోడ్డు నుంచి బేరికై, మాలూరు, సర్జాపురం, హోసూరు వరకు రహదారి పలు చోట్ల గుంతలమయంగా మారడంతో ప్రయాణీకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గాలలో నిత్యం వేలాదిమంది కార్మికులు, విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. తారురోడ్డు మట్టిరోడ్డుగా మారి దుమ్ము రేగుతూ ఇతర వాహన దారులకు ప్రవమాదకరంగా మారింది. బాగలూరు నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లే రహదారులు పలు చోట్ల గుంతలు పడి కంకర తేలాయి. రోడ్లను మరమ్మతు చేసి అందుబాటులోకి తేవాలని ప్రయాణీకులు, ప్రజలు కోరుతున్నారు.



బాగలూరు రోడ్డులో గోతులు ఇలా..

పాఠశాల భవనాలు ప్రారంభం



నూతన భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి చక్రపాణి, కలెక్టర్ సరయు, ఎమ్మెల్యే, మేయర్

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలో రూ.2.30 కోట్లతో నిర్మించిన ఆరు పాఠశాలలను పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా డెంకణీకోట మున్సిపాలిటీ నూతన కార్యాలయానికి భూమిపూజ చేశారు. మంత్రి చక్రపాణి మాట్లాడుతూ జపాన్ సంస్థ ఆర్థిక సహకారంతో రూ.8వేల కోట్లతో హోసూరు కార్పొరేషన్, కృష్ణగిరి, ధర్మపురి ప్రాంతాల తాగునీటి అవసరాలను తీర్చేందుకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ త్వరలో హొగేనేకల్ వాటర్ ప్రాజెక్టు రెండో విడత విస్తరణ పనులను ప్రారంభిస్తారన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు కార్పొరేషన్ కోసం బెంగళూరు నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు త్వరల్లో అమలు కానుందన్నారు. రూ.550 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ విధానం అమలు చేయనున్నట్టు తెలిపారు. 2వేల ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం రానుందన్నారు. రూ.100 కోట్లతో హోసూరు జనరల్ ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. హోసూరు కార్పొరేషన్, రాష్ట్ర ఫైనాన్స్ బోర్డు గ్రాంట్ పథకం క్రింద ముత్తురాయన్ జీబీ ప్రాథమిక పాఠశాల భవనాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సరయు, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ , మేయర్ సత్య, హోసూరు కార్పోరేషన్ కమిషనర్ శ్రీకాంత్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా ఎడ్యుకేషన్ అధికారి మునిరాజు, డెంకణీకోట మున్సిపాలిటీ చైర్మెన్ శ్రీనివాసన్, తళి చైర్మెన్ శ్రీనివాసన్, డెంకణీకోట మున్సిపాలిటీ, డిప్యూటీ చైర్మెన్ అబ్దుల్ కలాం, ఎగ్జిక్యూటివ్ అధికారి మంజునాథ్, జూనియర్ ఇంజనీర్ పళణిస్వామి, ఆరోగ్యస్థాయి సమితి చైర్మన్ మాదేశ్వరన్, జోనల్ కమిటీ రవి, మున్సిపల్ విద్యా కమిటీ చైర్మెన్ శ్రీధరన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారి

రాయచూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ ప్లానింగ్ అధికారి శరణబసరాజ కెసరట్టి శనివారం రాయచూరు తాలూకాలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులను పరిశీలించారు. బిజనగేరా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఇంటి పన్ను వసూళ్లను మరింత వేగవంతం చేయాలని పీడీఓకు ఆదేశించారు. అనంతరం జంబలదిన్ని గ్రామ పంచాయతీని సందర్శించి ఉపాధిహామి పథకం ద్వార ఏర్పాటు చేసిన నర్సరీ ప్లాంటేషన్ పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించి స్థళ పరిశీలన చేశారు. అనంతరం గ్రామంలోని బయో గ్యాస్ ప్లాంట్, గో శాల, శిశు కేంద్రాలను అధికారి పరిశీలించారు. గ్రామంలో కుండెలు తయారు చేసే వాళ్ల దగ్గరకెళ్లిన అధికారి వాటిని తయారీ చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగస్‌ఖాన్ దొడ్డి గ్రామ పంచాయతీలో సంజీవిని షెడ్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.